# 'మత్తు'కు బానిసలు కావొద్దు..

- తల్లిదండ్రులు పిల్లల నడవడికను నిత్యం గమనించాలి
- అవగాహన కార్యక్రమంలో ఖమ్మం సీపీ సునీల్‌దత్


మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 22 : నేటి యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, పిల్లల నడవడికను, అలవాట్లను నిత్యం గమనిస్తూ ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తల్లిదండ్రులకు సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారితోపాటు వాటి వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గత నెలలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నిందితులను విచారించగా.. సత్తుపల్లి ప్రాంతాల్లో కొందరికి గంజాయి అందజేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. దీంతో వారందరినీ గుర్తించి వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్, అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాలు, గంజాయి శరీరానికి హాని చేయడంతోపాటు జీవితాలను అంధకారంలోకి నెట్టి వేస్తాయని పేర్కొన్నారు. ఈ క్షణం చేసే తప్పుతో జీవితాంతం పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గంజాయికి అలవాటుపడి మానుకోలేని పరిస్థితి ఉన్న వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉచితంగా కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేయడంతోపాటు మత్తు పదార్థాలు వినియోగాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సత్తుపల్లి ఠాణాను సందర్శించిన సీపీ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ రవాణా, దొంగతనాల కట్టడికి రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపట్టాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ రఘు, సీఐ కిరణ్ పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా

## ప్రజా వ్యవస్థకు ఆటంకం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలి

## నెలవారీ సమీక్ష సమావేశంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు


చంద్రుగొండ ఎస్సై స్వప్నను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 22 : రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు వారి కదలికలను గమనించాలని, వారిలో మార్పు తీసుకొచ్చే విధంగా ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించాలని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఆదేశించారు. ప్రజా వ్యవస్థకు ఆటంకం కలిగించే వారిని గమనించి, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లాలోని పోలీస్ అధికారులకు నిర్వహించిన నెలవారీ సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. నేరస్తులకు కచ్చితంగా శిక్ష పడేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కృషి చేయాలన్నారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం చేస్తున్నారని, వారి నుంచి ప్రజలను చైతన్యవంతులను చేసేలా నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేసే వారితోపాటు సేవించే వారిపై సైతం కేసులు నమోదు చేయాలన్నారు. తవిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, వారి కదలికలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అన్ని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫింగర్ ప్రింట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎస్సై గంజి స్వప్నను అభినందించారు. సమావేశంలో డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, సతీశ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఇన్‌స్పెక్టర్లు చెన్నూరి శ్రీనివాస్, మడిపెల్లి నాగరాజు, ఎస్పీ కార్యాలయ ఏవో జయరాజు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

- నిత్యం ఆరేడు రకాల పనులతో ఏఈవోల సతమతం
- దీనికితోడు కేంద్ర 'డిజిటల్ క్రాప్ సర్వే' పేరిట అదనపు భారం
- ఇంతటి ఒత్తిడి మోయలేకపోతున్నామంటున్న ఏఈవోలు
- చేసి తీరాల్సిందేనంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- చేయబోమన్న ఏఈవోలకు ఇప్పటికే మెమోలు, నోటీసులు జారీ
- క్షేత్రస్థాయిలో రైతుల కోసమే విస్తరణాధిరులను తెచ్చిన కేసీఆర్
- కానీ.. ఇప్పుడు 'కేంద్ర' పనులనూ చేయాలంటున్న రేవంత్

ఏకకాలం

# బహుళ పనిభారం


రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఏఈవోలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 22 : క్షేత్రస్థాయిలో నిత్యం కర్షకులకు చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)ను నియమిస్తే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పనులతో పాటు బోలెడంత భారాన్ని మోపుతోంది ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కారు. 'ఇంతటి పనిభారం మోయలేం మహాప్రభో..' అంటూ ఏఈవోలు మొరపెట్టుకున్నా సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేదు. అత్యంత కష్టతరమైన ఈ సర్వేను తాము చేయలేమంటూ ఏఈవోలు నిరసన వ్యక్తం చేసినందుకు ఆగ్రహించిన కాంగ్రెస్ సర్కారు.. ఏకంగా వారిపై కక్షగట్టింది. 'ఉద్యోగం చేస్తారా? ఇంటికి వెళ్తారా?' అన్నట్లుగా వ్యవహరిస్తున్నది. దీంతో హడలిపోయిన ఏఈవోలు.. తరువాత విధుల్లోకి వెళ్తున్నా వారి హాజరును నమోదు చేయడం లేదు. ఉన్నతాధికారులతో చెప్పి వారికి సిక్ లీవ్ (సీఎల్) వేయిస్తోంది. దీంతో మరో వారంలో అందాల్సిన వేతనాలు అందుతాయో.. లేదోనన్న.. ఆందోళన విస్తరణాధిరులను వేధిస్తోంది. 'కేంద్ర ప్రభుత్వ డిజిటల్ క్రాప్ సర్వే చేయలేం' అన్న పాపానికి ఏకంగా మెమోలు జారీ చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తోంది.

### కర్షకుల కోసమే నాడు నియామకం..

పంటల సాగులోనూ, ప్రభుత్వ పథకాల చేరవేతలోనూ క్షేత్రస్థాయిలో కర్షకుల వెన్నంటి ఉండేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఏఈవోలను నియమించింది. ఐదు వేల ఎకరాలకు ఓ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి దాని పర్యవేక్షణ బాధ్యతను ఏఈవోలకు అప్పగించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతు వేదికను నిర్మించింది. ఖమ్మం జిల్లాలో మొత్తం 130 క్లస్టర్లను ఏర్పాటు చేయడంతో దాని యూనిట్‌గా ఏఈవోలు నిత్యం అన్నదాతలకు సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 130 క్లస్టర్లలో 130 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. వీరిలో 108 మంది రెగ్యులర్ ఏఈవోలు కాగా.. 16 మంది ఒప్పంద ఏఈవోలు. మరో ఐదుగురు ఆత్మ ప్రాజెక్టు నుంచి వచ్చిన విస్తరణాధికారులు.

### నిత్యం క్షేత్రాల్లో..

నిత్యం క్షేత్రంలో కర్షకులతో మమేకమవుతూ పనిచేస్తుంటారు ఏఈవోలు. వానకాలం ప్రారంభం నుంచి మొదలుకొని.. యాసంగి ముగిసే వరకూ అన్నదాతలకు అన్ని సహాయక సహకారాలు అందిస్తున్నారు. రైతుబంధు, రైతు బీమా, పంటల నమోదు, ఎరువుల పంపిణీ, విత్తనాల సరఫరా, పంటల కొనుగోళ్లు వంటి పనులను క్షేత్రస్థాయిలో చేస్తుంటారు. సదస్సులు, కాన్ఫరెన్సుల్లో ప్రభుత్వం సూచించిన అంశాలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తుంటారు. ఇన్ని పనులతో ఇప్పటికే తలకుమించిన భారం పడుతున్న సమయంలో ఇటీవల కేంద్రం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను కూడా వీరే చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రైతుల పొలాల వద్దకు వెళ్లి పంటలను ప్రత్యక్షంగా ఫొటో తీసి కేంద్ర ప్రభుత్వ యాప్‌లో నమోదు చేయాలి. సర్వే నంబర్ల ఆధారంగా కుంట కుంటగా ఉండే పంటల వద్దకు వెళ్లి సర్వే చేయాల్సి రావడం ఎంతో కష్టతరమైన పని. తమ మాతృశాఖ పనులతోనే భారం పడుతున్నందున ఈ కష్టతరమైన సర్వే వల్ల వారికి మరింత భారం పడుతోంది. ఇంతటి భారాన్ని తాము మోయలేమంటూ ఏఈవోలు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. లేదంటే తమకు సహాయకులనైనా ఇవ్వాలని, లేదంటే ఇతర రాష్ట్రాల మాదిరిగా ఈ సర్వేను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని కోరుతున్నారు. కానీ ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంటోంది.

### రెండు క్లస్టర్లకే 93 రోజులు..

ఏటా డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిరుడు నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం, మల్లెమడుగు క్లస్టర్లలో ఏఈవోలు ప్రయోగాత్మకంగా డిజిటల్ క్రాప్ సర్వే చేశారు. ఆ రెండు క్లస్టర్ల సర్వే పూర్తయ్యేందుకే మొత్తం ముగ్గురు ఏఈవోలకు దాదాపు 93 రోజుల సమయం పట్టింది. అందుకని ఇంతటి పని ఒత్తిడిలో ఇలాంటి కష్టమైన సర్వే చేయడం తమకు మోయలేని భారమవుతుందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయాల్సిందేనంటూ ప్రభుత్వం హుకుం జారీ చేస్తోంది.


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు (ఫైల్)

### ఉద్యోగం చేస్తారా? వదులుకొని పోతారా?

కేంద్ర సర్వే చేయలేమన్న ఏఈవోలపై ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ నెల 10న సదరు ఏఈవోలకు మెమోలిచ్చారు. కొద్ది రోజులకే 21 మందికి మరోమారు నోటీసులు జారీ చేశారు. సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకోని పక్షంలో ఒకటి రెండు రోజుల్లో విధుల్లోంచి తొలగిస్తామంటూ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఏకంగా ఇతర కారణాలను చూపి పలు జిల్లాల్లో పలువురు ఏఈవోలను సస్పెండ్ చేశారు. దీంతో జిల్లాలోని ఏఈవోలు ఆందోళనలో పడ్డారు.

### ఇతర రాష్ట్రాల మాదిరిగా చేయాలి..



డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ మన రాష్ట్రానికే పరిమితం కాదు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రక్రియ. కేంద్రం ప్రత్యేకంగా నిధులివ్వడంతో ఆయా రాష్ట్రాలు ఈ ప్రాజెక్టును ప్రైవేట్ సంస్థలకు అప్పగించాయి. తెలంగాణలో మాత్రమే ఏఈవోలు చేయాలంటున్నారు. తాత్కాలికంగా ఓ సహాయకుడిని నియమించినా సర్వే పూర్తి చేస్తాం. కానీ.. ప్రభుత్వం అంగీకరించడం లేదు. ఏఈవోలకు మరింత ఒత్తిడి పెరుగుతోంది.

**–నాగుల్‌మీరా, ఏఈవోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

# పెద్దాసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా..

## ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి


ఖమ్మం నగరంలోని పెద్దాసుపత్రి అధికారులతో సమావేశమైన ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం సిటీ, అక్టోబర్ 22 : ఉభయ జిల్లాలతోపాటు పొరుగు జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సార్వజనీన ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దాసుపత్రిని సందర్శించిన ఆయన.. పలు వార్డుల్లో పర్యటించారు. పాత దవాఖాన భవనం కురుస్తుందని తెలుసుకుని పరిశీలించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ఛాంబర్‌లో స్థానిక అధికారులు, వైద్యులతో సమావేశమయ్యారు. దవాఖానలో ప్రస్తుతానికి 570 బెడ్లు ఉన్నాయని, రోజుకు దాదాపు 2 వేల మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని వైద్యులు చెప్పారు. దీనికి అనుసంధానంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఉన్నప్పటికీ సరిపడా సిబ్బంది లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ దవాఖానకు సంబంధించి అన్ని రకాల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. హాస్పిటల్ అవసరాల నిమిత్తం నాలుగు ఫ్రీజర్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆర్ఎంవోలు డాక్టర్ రాంబాబు, డాక్టర్ కళావతిభాయి, డాక్టర్ రాథోడ్, జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, మిక్కిలినేని నరేందర్, ఇమామ్, దుంపల రవి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు గవర్నర్

## రేపు, ఎల్లుండి భద్రాద్రి, ఖమ్మంలో పర్యటన



భద్రాచలం, అక్టోబర్ 22: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 24, 25 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. 24న సాయంత్రం సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. 25న ఉదయం భద్రాచలంలో సీతారామ చంద్రస్వామిని దర్శించుకుంటారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన తర్వాత స్థానికంగా జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**25న ఖమ్మంలో..**

ఖమ్మం, అక్టోబర్ 22: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 25న జిల్లాలో పర్యటించనున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 25న మధ్యాహ్నం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారని తెలిపారు. గంటపాటు జిల్లా అధికారులతో సమావేశమవుతారని, మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రసిద్ధ కవులు, కళాకారులు, కేంద్ర, రాష్ట్ర అవార్డు గ్రహీతలతో సమావేశమవుతారని, సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరుతారని తెలిపారు. డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- దీపావళి పటాకుల దుకాణాలు, జాగ్రత్తలపై సమీక్ష

# పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి


సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ


హాజరైన వివిధ శాఖల అధికారులు

ఖమ్మం, అక్టోబర్ 22 : పటాకుల దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించి ఉండకుండా చూడాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో దీపావళి పటాకుల దుకాణాలకు ఏర్పాట్లు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 31న జరుపుకునే దీపావళి పండుగకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకోసం పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలన్నారు. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో పటాకుల దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ, మున్సిపల్, గ్రామపంచాయతీ అనుమతులు తప్పక ఉండాలన్నారు. ప్రజలు ప్రమాదాలు, ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 1077కు కాల్ చేస్తే అధికారులు వెంటనే చర్యలు చేపడతారని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఎస్బీ ఏసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.అజయ్‌కుమార్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, డీఎంహెచ్‌వో వి.సుబ్బారావు, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీఉల్లా, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ట్రైనీ ఐఏఎస్‌లు


అంగన్‌వాడీ కేంద్రం నమూనాను అందిస్తున్న టీచర్లు

కారేపల్లి, అక్టోబర్ 22: జిల్లాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా రాజస్థాన్, ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు మండలంలో మంగళవారం పర్యటించారు. అల్యాతండాలోని స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశమైన శిక్షణ ఐఏఎస్‌లు తేజస్విని తబాని, అనితా మీనా, వైభవ్ మీనా, అల్టామాష్ ఘాజీ, విపుల్ సింఘాల్.. మహిళలు తీసుకుంటున్న రుణాలు, లింకేజీ, స్త్రీనిధి రుణాలు, వాటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు, తిరిగి ఎలా చెల్లిస్తున్నారనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న విద్య, పోషకాహారంపై ఆరా తీశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించి అభినందించారు. శిక్షణ ఐఏఎస్‌ల వెంట ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఏపీవో సుధీర్, ఐకేపీ సీసీలు ఉన్నారు.

# ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, అక్టోబర్ 22 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకింగ్/ఐబీపీఎస్, పీవోస్, క్లర్క్స్ వంటి పోటీ పరీక్షల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 రోజులపాటు ఉచిత కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ (studycircle.cgg.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకునే గడువును 27వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని, ఎంపికైన వారికి నెలవారీ స్కాలర్‌షిప్, స్టడీ మెటీరియల్, లాంగ్ నోట్ బుక్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040-27540104 నంబర్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని పీవో కోరారు.

# పోరాట భూమికే ఎసరు..

- నాడు నిరుపేదలు గుడిసెలు వేసిన 1.20 ఎకరాలు కబ్జా
- తన భూమిలో కలుపుకొని సాగు చేస్తున్న అధికార పార్టీ నాయకుడు
- ప్రస్తుతానికి ఆ భూమి విలువ రూ.50 లక్షలపైనే..
- ఆనాటి భూ పోరాటంలో పోలీసు కాల్పులకు ఏడుగురు బలి
- ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు

ముదిగొండ, అక్టోబర్ 22 : భూ పోరాటంలో భాగంగా కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిరుపేదలు గూడు కోసం ఆనాడు ఆ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేశారు. అక్కడే శిబిరాన్ని ఏర్పాటు చేసి దీక్షకు పూనుకున్నారు. ఈ క్రమంలో గుడిసెవాసుల పోరాటం తీవ్రరూపం దాల్చగా.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో పోలీసులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వారి పోరాటస్ఫూర్తికి వెలసిన అమరవీరుల స్తూపం 'ముదిగొండ కాల్పుల ఘటన'ను ఇప్పటికీ గుర్తుకు తెస్తుంది. అయితే ఏ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేశారో ఆ భూమినే అధికార పార్టీ నాయకుడు ఇప్పుడు దర్జాగా కబ్జా చేశాడు. ప్రస్తుతం అధికారం మాదే.. అడిగేవారెవరు అనే ధీమాతో యథేచ్ఛగా పంట సాగు చేసుకుంటున్నాడు. వివరాల్లోకెళ్తే.. 2007లో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో పేదలకు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూమి పోరాటం చేపట్టారు. ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 145లో గల 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేశారు. ఈ పోరాటం 2007, జూలై 27 నాటికి తీవ్ర రూపం దాల్చింది. గుడిసెలు వేసిన ప్రాంతంలో దీక్షా శిబిరం ఏర్పాటు చేయగా.. అక్కడ మొదలైన ఘర్షణ పోలీసు కాల్పుల వరకు దారితీయడంతో కాల్పుల్లో ఏడుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం మరణించిన వారి కుటుంబాలకు పరిహారం అందించింది. అయితే కాల్పుల ఘటనతో భయభ్రాంతులకు గురైన పేదలు తాము గుడిసెలు వేసిన ప్రాంతం నుంచి ఒక్కొక్కరుగా వెళ్లిపోవడంతోపాటు ఆ భూమి గురించి మరిచిపోయారు.

### కన్నేశాడు.. కబ్జా చేశాడు..

దీనిని ఆసరా చేసుకున్న అధికార పార్టీ నాయకుడొకరు కొన్నాళ్లుగా ఆ భూమిపై కన్నేశారు. కొద్దికొద్దిగా ఆక్రమిస్తూ పక్కనే ఉన్న తన భూమిలో దానిని కలుపుకొని దర్జాగా పంటలు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతానికి ఆ భూమి విలువ రూ.50 లక్షలపైనే ఉంది. అయితే ఒకరిద్దరు ఈ విషయాన్ని గమనించి.. ప్రశ్నించినా ఆ భూమి తనదే అని బుకాయిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాడు కాల్పుల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం.. సదరు నాయకుడు ఆ పార్టీలోనే ఉండడంతో భూ ఆక్రమణపై మాట్లాడేందుకు గ్రామస్తులు వెనుకాడుతున్నారు. రూ.50 లక్షల విలువైన భూమి అప్పనంగా పట్టా చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. నాడు పేదల కోసం భూ పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీలు సైతం సదరు ఆక్రమణదారుడిపై ఫిర్యాదు చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుడి నుంచి స్వాధీనం చేసుకోకపోతే నాటి పోరాటానికి అర్థం లేకుండా పోతుందని గ్రామస్తులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు..



నేను ఇటీవలే ముదిగొండ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించాను. వెంకటాపురంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై మా సిబ్బందితో విచారణ జరిపించి ప్రభుత్వ భూమి అని తేలితే స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా, ఎంతటివారైనా కఠినచర్యలు తీసుకుంటాం.

**– సునీత ఎలిజబెత్, తహసీల్దార్**


నాడు ఇదే భూమి వద్ద సమావేశమైన నిరుపేదలు (ఫైల్)



'ప్రభుత్వ భూమి' అంటూ నాడు అధికారులు పెట్టిన బోర్డు (ఫైల్)


నేడు అదే భూమిలో ఆక్రమణదారుడు సాగు చేస్తున పంట